ఎమ్మెల్యే కోవ లక్ష్మి పూజలు

ఆలయంలో ఎమ్మెల్యే కోవ లక్ష్మికి ప్రసాదం అందిస్తున్న దేవర వినోద్

రెబ్బెన, జనవరి 29 : మౌని అమావాస్యను పురస్కరించుకొని రెబ్బెన మండలం ఇందిరానగర్ గ్రామ పంచాయతీలో కొలువైన కనకదుర్గాదేవి స్వయంభూ మహంకాళి దేవస్థానంలో బుధవారం ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి పూజలు నిర్వహించారు. మొక్కులు చెల్లించుకున్నారు. ప్రధాన అర్చకుడు దేవర వినోద్ భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు మోడెం తిరుపతిగౌడ్, కమిటీ సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల పొలంబాట

పొలంలో నారు సేకరిస్తున్న ఫిల్టర్‌బెడ్ పాఠశాల విద్యార్థులు

మందమర్రి, జనవరి 29 : మందమర్రి పట్టణంలోని ఫిల్టర్‌బెడ్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు బుధవారం పొలంబాట పట్టారు. మండల పరిధిలోని శంకర్‌పల్లి గ్రామంలోని పొలాలను సందర్శించారు. క్షేత్రస్థాయిలో వ్యవసాయం గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. నారు సేకరించి నాట్లు వేశారు. అదే వ్యవసాయ క్షేత్రంలో రైతు పెంచుతున్న చేపల చెరువులు, కూరగాయలు, పండ్ల తోటలను పరిశీలించారు. విద్యార్థులకు ప్రత్యక్షంగా వ్యవసాయం గురించి వివరించడం వల్ల మరింత జ్ఞానం పెరుగుతుందని గైడ్ టీచర్ భీంపుత్ర శ్రీనివాస్ తెలిపారు. ప్రతి నెలలో ఒకసారి క్షేత్ర పర్యటనలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస చారి, ఉపాధ్యాయులు ఉమాదేవి, రవి, లలిత తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతీసంప్రదాయాలు కాపాడుకోవాలి

తిర్యాణి, జనవరి 29 : ఆదివాసుల సంస్కృతీసాంప్రదాయాలు గొప్పవని, వాటిని కాపాడుకోవాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ ఏఎస్పీ చిత్తరంజన్ పేర్కొన్నారు. మండలంలోని గడలపల్లి పంచాయతీ పరిధి పావనమడుగు గంగా వద్ద ఏర్పాటు చేసిన శ్రీ పహండీ కుపర్ లింగో వద్ద మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌తో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆదివాసీ నాయకుడు సోయం చిన్ను రచించిన 'కోయ పుణ్యం' పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం కమిటీ సభ్యులు పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. రెబ్బన సీఐ బుద్దే స్వామి, తిర్యాణి ఎస్ఐ శ్రీకాంత్, పీఏసీఎస్ చైర్మన్ చుంచు శ్రీనివాస్, గోండ్వాన పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు సిడాం అర్జు, జిల్లా సర్‌మేడీ మోతీరాం, మాజీ ఎంపీపీ వెడ్మ కమల, నాయకులు అనీల్‌గౌడ్, జంగోలింగో దీక్షాపరులు తదితరులు పాల్గొన్నారు.

బాలికా సంక్షేమానికి కృషి చేయాలి

కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ఆసిఫాబాద్ టౌన్, జనవరి 29 : బాలికల సంరక్షణ, సంక్షేమానికి అధికారులు సమష్టిగా కృషిచేయాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే సూచించారు. జాతీయ బాలికా దినోత్సవం, బేటీ బచావో–బేటి పడావో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా కలెక్టరేట్‌లో బుధవారం జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఆడెపు భాస్కర్‌తో కలిసి ఆయన హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి, కార్యక్రమాన్ని ప్రారంభించారు. బాలికల సంక్షేమానికి ప్రభుత్వాలు ఎన్నో చట్టాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నాయని, బాలికల హక్కులను కాపాడుకుందామని తెలిపారు. విద్యార్థినులు చదువుతో పాటు, క్రీడారంగంలో

మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం జిల్లాలోని వివిధ పాఠశాలల్లో బేటీ బచావో–బేటీ పడావో ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. జీసీపీవో శకుంతల, జిల్లా బాలల సంరక్షణ అధికారి మహేశ్, సఖి సిబ్బంది, జిల్లా మహిళా సాధికారత కేంద్రం ప్రతినిధులు శారద, మమత, రాణి, సాగర్, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

మహిళా శక్తి క్యాంటీన్‌లో నాణ్యత పాటించాలి..

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ మహిళా శక్తి పథకంలో భాగంగా ఏర్పాటు చేసిన క్యాంటీన్లలో నాణ్యత పాటించాలని కలెక్టర్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని క్యాంటీన్‌ను సందర్శించారు. క్యాంటీన్‌కు వచ్చే వారికి రుచికరమైన ఆహారం అందించాలని సూచించారు. డీఆర్డీవో దత్తారాం, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రామకృష్ణ, క్యాంటీన్ నిర్వాహకులు పాల్గొన్నారు.

మహిళల రక్షణే ప్రధాన లక్ష్యం

- **మంచిర్యాల డీసీపీ భాస్కర్**
- **ప్రభుత్వ, ప్రైవేటు మహిళల వసతి గృహాల నిర్వాహకులతో సమీక్షా సమావేశం**

మంచిర్యాల అర్బన్, జనవరి 29 : బాలికలు, మహిళల రక్షణ, భద్రత మంచిర్యాల జోన్ పోలీస్‌ల ప్రధాన బాధ్యత, లక్ష్యమని డీసీపీ భాస్కర్ పేర్కొన్నారు. మంచిర్యాల ఏసీపీ ఆర్ ప్రకాశ్‌తో కలిసి పట్టణంలోని ప్రభుత్వ మహిళా కళాశాలల ప్రిన్సిపాళ్లు, బాలికల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రభుత్వ, ప్రైవేట్ బాలికల, మహిళా వసతి గృహాల నిర్వాహకులు, వార్డెన్లతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్టళ్లలో తీసుకోవాల్సిన భద్రతాపరమైన చర్యలు, సీసీ కెమెరాల ప్రాముఖ్యత, సెక్యూరిటీ గార్డ్స్ ఏర్పాటు గురించి వివరించారు. తగు సూచనలు, ఆదేశాలు చేశారు. 30 రోజుల సామర్థ్యం కలిగిన సీసీటీవీ కెమెరాలు తప్పనిసరిగా అమర్చుకోవాలని సూచించారు. బాలికల ప్రవర్తన, కదలికలను గమనిస్తూ ఇబ్బందులు ఎదురైతే, ప్రమాదకర పరిస్థితి ఉంటే వారి తల్లిదండ్రులకు సమాచారం అందించాలని తెలిపారు. అలాగే వసతి గృహాల సమీప ప్రాంతాల్లో ఎవరైనా అనుమానాస్పందంగా సంచరిస్తే వెంటనే పోలీసుల దృష్టికి తేవాలని సూచించారు. ఈ సమావేశంలో పట్టణ సీఐ ప్రమోద్ రావు, షీ టీం ఇన్‌చార్జి ఎస్ఐ హైమా, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ భాస్కర్

వంద శాతం అక్షరాస్యత సాధించాలి

- **మంచిర్యాల అదనపు కలెక్టర్ సభావత్ మోతీలాల్**

కాసిపేట, జనవరి 29 : కాసిపేటను వంద శాతం అక్షరాస్యత మండలంగా తీర్చిదిద్దేందుకు జిల్లా అధికారుల సమన్వయంతో గ్రామస్థాయిలో అధికారులు కృషిచేయాలని మంచిర్యాల అదనపు కలెక్టర్ సభావత్ మోతీలాల్ సూచించారు. కాసిపేటను 100 రోజుల్లో వంద శాతం అక్షరాస్యత మండలంగా తీర్చిదిద్దుతాం అనే కార్యక్రమంపై ముత్యంపల్లి రైతు వేదికలో బుధవారం డీఆర్డీవో, డీపీవో, డీడబ్ల్యూవో, గ్రామస్థాయి అధికారులకు ఒక రోజు శిక్షణ నిర్వహించారు. ఉద్దేశాన్ని, ప్రణాళికను, అమలు విధానాన్ని వివరించారు. అనంతరం అందరితో అక్షర ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వయోజన విద్య జిల్లా ప్రాజెక్ట్ అధికారి పురుషోత్తం నాయక్, డీఆర్డీవో కిషన్, డీపీవో దొంతినేని వెంకటేశ్వర్ రావు, బెల్లంపల్లి ఆర్డీవో హరి కృష్ణ, మంచిర్యాల ఆర్డీవో శ్రీనివాస రావు, సీడీపీవో స్వరూప రాణి, జిల్లా విద్య శాఖ క్వాలిటీ కో ఆర్డినేటర్ సత్యనారాయణ మూర్తి, తహసీల్దార్ భోజన్న, ఎంపీడీవో సత్యనారాయణ సింగ్, వయోజన విద్యా శాఖ డీఆర్పీలు శాంకరి, కొండు జనార్దన్, సువర్ణ, సుమన్, మండలంలోని జీపీల కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, ఐకేపీ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మోతీలాల్

మహిళ మృతిపై వీడని మిస్టరీ

- **నాలుగు రోజుల క్రితం మంచిర్యాలలో కారు ఎక్కి వెళ్లిన మమత**
- **గంగాధర మండలం కొండన్నపల్లి వద్ద అనుమానాస్పద స్థితిలో మృతి**
- **లభించని ఆమె కుమారుడు ధృవ ఆచూకీ**

గంగాధర, జనవరి 29 : కరీంనగర్ జిల్లా గంగాధర మండలం కురిక్యాల కొండన్నపల్లి గ్రామాల మధ్య వరదకాలువ వద్ద మంచిర్యాలకు చెందిన మమత అనుమానాస్పద స్థితిలో మృతి చెందగా, ఈ ఘటనపై మిస్టరీ వీడడం లేదు. మంచిర్యాలకు చెందిన మమత ఐదేళ్ల క్రితం భరత్ అనే వ్యక్తిని ప్రేమ వివాహం చేసుకున్నదని, మనస్పర్థల కారణంగా వేరుగా తెలిసిన వారి ఇంట్లో ఉంటున్నట్లు తెలిసింది. వీరికి నాలుగేళ్ల కుమారుడు ధృవ ఉన్నాడు. ఈ నెల 25న నూనె ప్యాకెట్లు తెస్తానని చెప్పి ఇంటి నుంచి బయటికి వెళ్లిన మమత, కొండన్నపల్లి వరదకాలువ వద్ద ఈ నెల 27న శవమై కనిపించింది. గంగాధర పోలీసులు మహిళ అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, ఈ నెల 25న తన కుమారుడు ధృవతో కలిసి నూనె ప్యాకెట్ల కోసం బయటికి వచ్చిన మమత, గుర్తు తెలియని కారు ఎక్కి వెళ్లినట్లు సీసీ కెమెరాలో రికార్డైంది. మంచిర్యాలలో మమత ఎక్కిన కారు ఎవరిది.. ఆమె ఎవరితో కలిసి కారులో ప్రయాణించింది, ఆమె ఎలా మృతిచెందింది.. కొండన్నపల్లి వరదకాలువ వద్ద ఎందుకు పడవేశారు.. మమతతో ఉన్న ఆమె కుమారుడు ధృవ ఏమయ్యాడనేది మిస్టరీగా మిగిలాయి. బుధవారం కరీంనగర్ ప్రభుత్వ దవాఖానలో మమత మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు అన్ని కోణాల్లో విచారణ చేస్తున్నారు. దీనిపై ఎస్సై నరేందర్‌రెడ్డిని వివరణ కోరగా.. దర్యాప్తును ముమ్మరం చేశామన్నారు. పూర్తి వివరాలు తెలిసిన తర్వాత వెల్లడిస్తామని తెలిపారు.

ప్రేమ విఫలమై యువకుడి ఆత్మహత్య

బెల్లంపల్లి, జనవరి 29 : ప్రేమ విఫలమవడంతో మనస్థాపానికి గురై ఓ యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలోని రడగంబాల బస్తీలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. టూటౌన్ ఎస్ఐ మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం కనుకుల గ్రామానికి చెందిన చింతల వివేక్ (21) చిన్నతనంలోనే తండ్రి మృతి చెందడంతో తల్లి రాజేశ్వరితో కలిసి అమ్మమ్మ ఇంట్లో (అంబేద్కర్ రడగంబాల బస్తీ) ఉంటున్నాడు. పదో తరగతి వరకు చదివిన యువకుడు, మంచిర్యాలలోని ఓ బట్టల దుకాణంలో పనిచేసేవాడు. ఇటీవల స్థానికంగా ఓ అమ్మాయిని ప్రేమించాడు. ఆమె ఒప్పుకోకపోవడంతో బాధపడుతూ దిగాలుగా ఉంటున్నాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి తల్లి, అమ్మమ్మతో కలిసి టీవీ చూస్తూ అదే గదిలో పడుకున్నాడు. బుధవారం ఉదయం లేచేసరికి ఉరేసుకొని కనిపించాడు. తల్లి రాజేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పురుగుల మందు తాగి ఒకరు..

కాసిపేట, జనవరి 29 : కాసిపేట గ్రామానికి చెందిన రత్నం రాజలింగు(56) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు కాసిపేట ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. సింగరేణి రిటైర్డ్ కార్మికుడు రత్నం రాజలింగు కొంత కాలంగా ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. చికిత్స తీసుకున్నా తగ్గకపోవడంతో మనోవేదనకు గురయ్యాడు. మంగళవారం రాత్రి ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటికి వచ్చాడు. బుధవారం ఉదయం కాసిపేట శివారులోని టేకు చెట్ల ప్లాంటేషన్‌లో పురుగుల మందు తాగి, చనిపోయి ఉన్నాడు. స్థానికులు చూసి బంధువులకు సమాచారం ఇచ్చారు. కొడుకు రత్నం అనువర్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఐదుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

మంచిర్యాల అర్బన్, జనవరి 29 : మంచిర్యాల జిల్లా కేంద్రంలోని తిలక్‌నగర్‌లో గల ఓపెన్ ప్లాట్స్‌లో పేకాటాడుతున్న ఐదుగురిని బుధవారం అరెస్ట్ చేసినట్లు పట్టణ ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపారు. ఉన్నతాధికారులకు వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు నిర్వహించగా, మంచిర్యాలకు చెందిన కొండు క్రాంతి కుమార్, లెక్కల సాయికృష్ణ, చింతపండు సాయికిరణ్, మేడిపల్లి రాము, దంగేటి సుధీర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. వారి నుంచి రూ.6300, రెండు బైకులు, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మరో నలుగురు పారిపోయారని, త్వరలోనే పట్టుకుంటామని పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆన్‌లైన్ మోసాలపై అవగాహన..

ఆన్‌లైన్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంచిర్యాల పట్టణ ఎస్ఐ కిరణ్ కుమార్ సూచించారు. జిల్లా కేంద్రంలోని బైపాస్‌రోడ్డులో గల తెలంగాణ తల్లి విగ్రహం వద్ద గల దుకాణదారులు, స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

సమాధి తవ్వి.. క్షుద్రపూజలు

బెజ్జూర్, జనవరి 29 : మండలంలోని ఏటిగూడ గ్రామంలో మంగళవారం రాత్రి క్షుద్ర పూజలు చేస్తున్నవారిని అదుపులో తీసుకున్నట్లు ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం. ఏటిగూడ గ్రామానికి చెందిన ఎర్నాగి చిన్నయ్య 14 రోజుల క్రితంలో మృతిచెందాడు. మృతదేహాన్ని గ్రామ శివారులో పూడ్చిపెట్టారు. కాగా, మంగళవారం రాత్రి అమావాస్య కావడంతో కొందరు వ్యక్తులు క్షుద్రపూజలు చేసేందుకు చిన్నయ్య మృతదేహాన్ని ఎంచుకున్నారు. ఈ క్రమంలో సమాధి తవ్వి.. అందులోని ఎముకలను తీసుకెళ్లారు. స్థానికులు అటుగా వెళ్తుండగా దుర్గంధం రావడంతో అనుమానం వచ్చి, పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు వచ్చి వారిని అదుపులోకి తీసుకోగా, కౌటాల సీఐ ముత్యం రమేశ్ ఆధ్వర్యంలో బెజ్జూర్ పోలీసులు విచారిస్తున్నట్లు సమాచారం.

దరఖాస్తు చేసుకోండి

మందమర్రి, జనవరి 29 : సింగరేణి విశ్రాంత ఉద్యోగులకు సంస్థ అందిస్తున్న కంట్రిబ్యూటరీ పోస్ట్ రిటైర్‌మెంట్ మెడికల్ స్కీం, నాన్ ఎగ్జిక్యూటివ్(సీపీఆర్ఎంఎస్, ఎన్ఈ) దరఖాస్తు చేసుకునేందుకు యాజమాన్యం మరో అవకాశం కల్పించిందని మందమర్రి ఏరియా పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్హత గల విశ్రాంత ఉద్యోగులు రూ.60 వేల కంట్రిబ్యూషన్‌తో ఈ పథకంలో చేరవచ్చని పేర్కొన్నారు. ఈ స్కీములో సభ్యులుగా ఉన్నవారు లైవ్ సర్టిఫికెట్ సమర్పించేందుకు ప్రస్తుతం ఉన్న పద్ధతులతో పాటు, ఈ మెయిల్ ద్వారా సమర్పించవచ్చని తెలిపారు.

రేపు హోటళ్లు, టిఫిన్ సెంటర్లు బంద్

బెల్లంపల్లి, జనవరి 29 : బెల్లంపల్లి పట్టణంలోని హోటళ్లు, టిఫిన్ సెంటర్లు శుక్రవారం బంద్ పాటిస్తున్నట్లు పట్టణ హోటల్ యూనియన్ అధ్యక్షుడు రేగుంట రాజలింగు తెలిపారు. హోటల్ యూనియన్ నూతన కార్యవర్గ ఎన్నిక, ధరల పెంపు, సభ్యుల సమస్యలు, ఇతర అంశాలపై సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశానికి యూనియన్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ శెట్టి హాజరవుతారని తెలిపారు. యజమానులు, బెల్లంపల్లి పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు.

CHANGE OF NAME

★I, PARVATALWAR ANUSAYA VENKATAYYA W/o. KRISHNA KOTHAPALLI age:45, H.No. 9-3-100, contractor Basthi, Bellampalli Dist: Mancherial, I Have changed my name from PARVATALWAR ANUSAYA VENKATAYYA. (Old Name) to **PAVANI KOTTAPALLI** (NEW NAME) **W/o. KRISHNA KOTTAPALLI.**

NTK-0000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677

మొరం తరలింపు అడ్డగింత

భీమారం, జనవరి 29 : మండల కేంద్రంలోని 138 సర్వే నంబర్‌లో మొరం ఎక్కడికీ తరలించేది లేదని, క్రీడా మైదానానికే అవసరమని స్థానిక కాంగ్రెస్ యువ నాయకులు కొక్కుల నరేశ్, ఆవిడపు రవి తేజ, సందనవేణి అజయ్ స్పష్టం చేశారు. సర్వే నంబర్‌లో మొరం తవ్వకాలను బుధవారం వారు అడ్డుకున్నారు. ఇక్కడి మొరాన్ని వేరే చోటికి తరలిస్తే ఎలా అని కాంట్రాక్టర్‌ను నిలదీశారు. దీంతో ఆర్ఐ స్రవంతి అక్కడికి చేరుకొని, వారితో మాట్లాడారు. ఇందిరమ్మ ఇల్లు నమూనాతో పాటు, దవాఖాన నిర్మాణానికి మొరం అవసరం ఉందని, అందుకు కలెక్టర్ నుంచి అనుమతులు కూడా ఉన్నాయని తెలిపారు. దీనిపై తహసీల్దార్ సదానందంను వివరణ కోరగా.. కలెక్టర్ ఆదేశాలు మేరకే మట్టి తరలిస్తున్నట్లు తెలిపారు. త్వరగా పనులు పూర్తికావాలని ఆదేశాలు ఉన్నాయని పేర్కొన్నారు.

బండి సంజయ్‌పై చర్యలు తీసుకోవాలి

దండేపల్లి, జనవరి 29 : ప్రజా యుద్ధ నౌక గద్దర్‌కు పద్మశ్రీ అవార్డును ఏకగ్రీవంగా ఇవ్వకపోగా, అవమానకరంగా మాట్లాడిన కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్‌పై చర్యలు తీసుకోవాలని అంబేద్కర్ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం తహసీల్ కార్యాలయ ఆవరణలో డీటీ విజయకు వినతి పత్రం అందించారు. మండలాధ్యక్షుడు ఎల్ బాపు, ఎస్సీ, ఎస్టీ ఐక్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోళ్ల రాజమల్లు, బచ్చల అంజన్న, సుభాష్, నవీన్, అర్షిత్, రహ్మతుల్లా తదితరులున్నారు.

పంట స్వాధీనం

దండేపల్లి, జనవరి 29 : ముత్యంపేట సమీపంలోని సర్వే నంబర్17లో గల ప్రభుత్వ ఆధీనంలో ఉన్న భూమిలో కొర్విచెల్మకు చెందిన కారుకూరి శంకరయ్య కంది పంట సాగుచేశాడు. పంట కోసి ఇంటికి తీసుకెళ్లే క్రమంలో పక్కా సమాచారం మేరకు రెవెన్యూ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. తహసీల్దార్ సంధ్యారాణి ఆదేశాల మేరకు ఆర్ఐ భూమన్న విచారణ చేపట్టి, పంటను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో రూ.570 వేలం వేశారు. ప్రభుత్వ ఆధీనంలో ఉన్న భూముల్లో అక్రమంగా పంట సాగు చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు.

పంచాయతీ కార్యదర్శులతో సమావేశం

మందమర్రి రూరల్, జనవరి 29 : మందమర్రి ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో ఎంపీడీవో రాజేశ్వర్ ఆధ్వర్యంలో పంచాయతీ రాజ్, ఈజీఎస్, కార్యదర్శులతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీలు, మురుగు కాలువలు, పైప్‌లైన్ లీకేజీలు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని తాగునీటికి కొరత లేకుండా చూడాలన్నారు. ఎంపీవో సత్యనారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మనోజ్, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

కాగజ్‌నగర్, జనవరి 29 : కాగజ్‌నగర్ ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో రమేశ్.. పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ క్షేత్ర సహాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సూచనలు చేశారు. ఏపీవో బుచ్చన్న, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రావణ్ సిబ్బంది పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తున్నరు

మంచిర్యాల అర్బన్, జనవరి 29 : చట్టసభలకు ఎన్నికైన నాయకులు రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేన శంకర్ ఆరోపించారు. సీపీఐ మంచిర్యాల జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా పార్టీ కార్యాలయంలో బుధవారం జోగుల మల్లయ్య అధ్యక్షతన నిర్వహించారు. సీపీఐ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ఫిబ్రవరి 23న బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ సెక్యులర్ భావజాలానికి తూట్లు పొడిచే విధానాలు మానుకోవాలని బీజేపీ ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, సభ్యులు మేకల దాసు, రేగుంట చంద్రశేఖర్, చిప్ప నర్సయ్య, బొల్లం పూర్ణిమ, భీమనథుని సుదర్శన్, దాగం మల్లేశ్, మిట్టపల్లి శ్రీనివాస్, ఖలిందర్ అలీఖాన్ తదతరులు పాల్గొన్నారు.

బడీడు పిల్లలను బడిలో చేర్పించాలి

భీమారం, జనవరి 29 : బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని, అందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకురావాలని భీమారం, జైపూర్ ఎస్ఐలు శ్వేత, నాగరాజు, చైల్డ్ వెల్ఫేర్ ఆఫీసర్ ఇందిరా, లేబర్ ఆఫీసర్ సత్యనారాయణ సూచించారు. ఆపరేషన్ స్మైల్ కార్యక్రమంలో భాగంగా భీమారం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో బృందం పర్యటించి, పాఠశాలకు హాజరు కానీ విద్యార్థులను గుర్తించి, మండల కేంద్రంలోని జడ్పీ సెకండరీ పాఠశాలలో చేర్పించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ జగన్మోహన్ గౌడ్, గోవింద్ సింగ్, స్పెషల్ కానిస్టేబుల్ మహేశ్ బాబు, డబ్ల్యూపీసీ మనీష, సీఆర్పీ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఐక్యంగా ఉంటేనే హక్కులు సాధ్యం

మందమర్రి, జనవరి 29 : జిల్లాలోని మున్నూరుకాపులంతా ఐక్యంగా ఉంటేనే హక్కులు సాధ్యమవుతాయని ఆ సంక్షేమ సంఘం పట్టణాధ్యక్షుడు మిట్ట లక్ష్మణ్ అన్నారు. మందమర్రి పట్టణంలో బుధవారం సంఘం నాయకులతో కలిసి క్యాలెండర్ ఆవిష్కరించారు. సంఘం పట్టణ ప్రధాన కార్యదర్శి పార్వతి రాజిరెడ్డి, యువజన అధ్యక్షుడు రాకం సంతోష్, ఉపాధ్యక్షుడు మిట్ట సూర్యనారాయణ, దాసరి జనార్దన్, తేండ్ర శ్యామ్, మాదాసు కుమార్, నల్లుల వెంకటేశ్, రామిడి కుమార్, కోల శ్రీనివాస్, పోలు శ్రీనివాస్, కడారి శ్రీధర్, సకినాల శంకర్, గాండ్ల రవి, గాండ్ల సదానందం, ఎం శ్రీనివాస్, మేడిపల్లి మల్లేశ్, తోట సురేందర్, వేణు, సంతోష్, తుపాకుల శ్రీనివాస్, సాతిని శ్రీనివాస్, బొలిశెట్టి రాజన్న తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకే ఇండ్లు ఇవ్వాలి

రెబ్బెన, జనవరి 29 : నిరుపేదలను గుర్తించి, నిజమైన లబ్ధిదారులకే ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని తెలంగాణ బొగ్గు గనుల కాంట్రాక్టు కార్మిక సంఘం (టీబీజీకేఎస్ అనుబంధం) బెల్లంపల్లి ఏరియా అధ్యక్షుడు అంబాల ఓదేలు డిమాండ్ చేశారు. ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్మికులు దరఖాస్తులు చేసుకున్న అనంతరం మాట్లాడారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న కార్మికులకు గ్రామ సభలో చదివిన జాబితాలో పేర్లు లేవని, నిలదీస్తే మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచనలు చేశారన్నారు. దీంతో దరఖాస్తుల కోసం కార్యాలయాల చుట్టూ తిరుగేందుకే సమయం పోతున్నదన్నారు. ఇగురం నర్సయ్య, కొండా లక్ష్మి, గోగర్ల రాజమ్మ, కుడి శోభ, రెడ్డి రాజేశ్వరి ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కాసిపేట, జనవరి 29 : కాసిపేట మండలంలో గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ స్వర్ణలత తెలిపారు. 33 కేవీ కొండాపూర్ పాత అండర్ గ్రౌండ్ కేబుల్ తీసి, కొత్తది మార్చేందుకు జరుగుతున్న పనుల కారణంగా అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

పారిశుధ్య కార్మికులకు సన్మానం

మంచిర్యాల టౌన్, జనవరి 29 : మంచిర్యాల మున్సిపాలిటీ పారిశుధ్య విభాగంలో పనిచేస్తున్న 30 మంది కార్మికులను బుధవారం ఇటీవల పదవీకాలం ముగించుకున్న 26వ వార్డు మాజీ కౌన్సిలర్ నాంపల్లి మాధవీశ్రీనివాస్ దంపతులు ఘనంగా సన్మానించారు. తమ పదవీ కాలంలో కార్మికులు తమకు ఎంతో సహకరించారని పేర్కొన్నారు.

ఉచిత కుట్టు మిషిన్లకు దరఖాస్తులు

ఆసిఫాబాద్ టౌన్, జనవరి 29 : తెలంగాణ క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్–హైదరాబాద్ ద్వారా ఇందిరా మహిళా శక్తి పథకం కింద ఉచిత కుట్టు మిషిన్ల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా అల్ప సంఖ్యాక వర్గాల సంక్షేమ శాఖ అధికారి ఆర్ రమాదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైనవారు ఈ నెల 31వ తేదీలోగా కలెక్టరేట్ భవన సముదాయంలో ఎఫ్–5 బీ లో గల జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ముగిసిన క్రీడలు

బెజ్జూర్ : విజేతలకు బహుమతులు అందిస్తున్న బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు

బెజ్జూర్, జనవరి 29 : మండలంలోని పాసన్‌పేటలో 20 రోజులుగా కొనసాగుతున్న క్రికెట్ పోటీలు బుధవారంతో ముగిశాయి. ఫైనల్‌లో కుకుడ జట్టుపై పాపన్‌పేట జట్టు విజయం సాధించింది. బీఆర్ఎస్ పార్టీ తాలూకా నాయకుడు ఆవుల రాజేశ్ కుమార్ యాదవ్, నియోజకవర్గ యూత్ కన్వీనర్ కాసిపాక రాజు, మహిళీ కన్వీనర్ చునార్కర్ కమలక్క, సీనియర్ నాయకులు ఖాజా మోహియుద్దీన్, నాయకులు బాపురావు, తిరుపతి బముమతులు అందజేశారు.

చింతలమానేపల్లిలో..

చింతలమానేపల్లి, జనవరి 29 : మండలంలోని రవీంద్రనగర్–1 గ్రామంలో నేతాజీ సుభాష్‌చంద్రబోస్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీలు బుధవారంతో ముగిశాయి. హోరా హోరీగా జరిగిన ఫైనల్‌లో కౌటాల జట్టుపై బాలాజీ అనుకోడ జట్టు గెలుపొందింది. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు అనుపమ్ దాస్, దీపక్, సంపత్, అభిజిత్, క్రీడాకారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

గైర్హాజరు కార్మికులకు కౌన్సెలింగ్

మందమర్రి, జనవరి 29 : గైర్హాజరుతో కార్మికులు ఉద్యోగాలను కోల్పోవద్దని మందమర్రి ఏరియా కేకే–5 గని మేనేజర్ ప్రవీణ్ సూచించారు. గని కార్యాలయంలో బుధవారం గైర్హాజరు కార్మికులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. విధి నిర్వహణలో పని స్థలాల వద్ద సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఉద్యోగం కోల్పోతే కుటుంబాలు రోడ్డునపడే పరిస్థితులు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో గని రక్షణాధికారి రమేశ్, సంక్షేమాధికారి మాస్కుల కార్తిక్, కార్యాలయ సూపరింటెండెంట్ బుచ్చయ్య, గుర్తింపు సంఘం పిట్ కార్యదర్శి గాండ్ల సంపత్ తదితరులు పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలతో విధులకు

కెరమెరి, జనవరి 29 : ఉపాధి హామీ ఉద్యోగులు బుధవారం నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. మూడు నెలల నుంచి జీతాలు రాకపోవడంపై ఏపీవో, ఈసీ, సాంకేతిక సహాయకులు, క్షేత్ర సహాయకులు ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు.

కోటపల్లి, జనవరి 29 : మూడు నెలలుగా వేతనాలు లేక ఇబ్బందులు పడుతున్నామని, ప్రభుత్వం తక్షణమే స్పందించి వేతనాలు చెల్లించాలని ఉపాధి హామీ ఏపీవో వెంకటేశ్వర్లు, సిబ్బంది డిమాండ్ చేశారు. ఈ మేరకు కోటపల్లి ఎంపీడీవో లక్ష్మయ్యకు వినతి పత్రం సమర్పించారు. జీతాల చెల్లింపులో జాప్యం వల్ల ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు.

కాగజ్‌నగర్, జనవరి 29 : పెండింగ్ వేతనాలు చెల్లించాలని కాగజ్‌నగర్ ఎంపీడీవో రమేశ్‌కు ఉపాధి హామీ సిబ్బంది వినతిపత్రం అందించారు. వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎన్నికలు నిర్వహించాలి

కాగజ్‌నగర్, జనవరి 29 : కాగజ్‌నగర్ పట్టణంలోని సిర్పూర్ పేపర్ మిల్లులో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి భూపాల్ ఆధ్వర్యంలో హైదరాబాద్ జాయింట్ లేబర్ కమిషనర్‌కు బుధవారం వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో రాజన్న, మధు, సోమన్న, సతీశ్, ముంజం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.